



కథానిక

ధనిష్ట

పొద్దున్న ఉత్తరం వచ్చిందగ్గర్నుంచి లలితకి మహా సంతోషంగా ఉంది. మొగుడెప్పుడొస్తాడా అని ఎదురుచూస్తోంది కాని మళ్ళీ కొంత సంబరం తగ్గించుకుంది. శేఖరం ఎప్పుడూ ఏదో వేళాకోళంచేస్తూవుంటాడు. లలితని ఏడిపించడం మహాసరదా శేఖరానికి. అంచేత యే విషయమైన అంత తేలిగ్గా చెప్పడానికి భయపడుతుంది.

ఇంతలోకే కారుహారన్ వినబడడం, తలుపు రెక్క చప్పుడై కారు వెళ్ళిపోవడం, శేఖరం రావడం జరిగాయి శేఖరాన్ని అంతదూరాన్ని చూచిన లలిత ఇంట్లో కెళ్ళి గబగబా ట్రేతో కాఫీ టిఫినూ తీసుకువచ్చి టేబుల్ మీద పెట్టింది. అతను రాగానే కోటు విప్పి వంకెకి తగిల్చింది. శేఖరం కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూటిఫెన్ కానిస్తున్నాడు. లలిత పక్కనే నిలబడి చీరకొంగు చిటికిన వేలికి చుట్టుకుంటూ మొదలెట్టింది.

"ఏమండీ!"

"..."

"మిమ్మల్నే. పలకరేం బెల్లంకొట్టినరాయిలా!"

"ఏం?" అన్నాడు పేపరుమీదనించి దృష్టి మళ్ళించకండానే.

"మావాళ్లింటిదగ్గర్నించి ఉత్తరంవచ్చింది" అంది అతనిధోరణికి చిన్నబుచ్చుకుని.

"వచ్చేఉంటుంది"అన్నాడు వెంకిగా ఇంకా పేపరుకేసి చూస్తూనే.

"అబ్బ చెప్పనివ్వరేం?"

"కొత్తేముంది?"

లలిత పెట్టిన ఏడుపు మొహంచూసి నవ్వుకున్నాడు.

"చెప్పేది వినకుండా మధ్యలో అందుకుంటారేం?"

"ఏం మరేం కొంపమునగలేదుకదా?" ఆమెకేసిచూస్తూ, ఆత్రుత నటిస్తూ.

"శుభంపలకరా మంకెన్నా అంటే యేదో అన్నట్టు కొంపమునగడం అంటారేమిటండీ?" వేళాకోళానికైనా హద్దుండాలి. నాతోమాట్లాడడం అంటేనే అంత మీకు" అంది విసుగుతోకూడిన విచారంతో.

"సరే దానికేంలేగాని యింతకీ యేమొచ్చిందేమిటి?"

"మీకంత వేళాకోళమైతే నేనుచెప్పను."

"మానేసెయ్ మరీమంచిది. నాకవతలపనుంది గూడాను"

"అంతేనన్నమాట" అంది అతని నిర్లిప్తతకి చింతపడి.

"మరెప్పుడూ ఉండేదేగా ఈ భాగోతం!"

"సరే చెపుతానుండండి."

"చెప్పనన్నావుగా?"

"మొగాళ్ళయితే ఎంతంటే అంత. లోకువగదా అని ఎన్నైనా అంటారు."

"చెపుతావా వెళ్లిపోనా?"అన్నాడు పోడానికుద్యమిస్తూ.

"మాచెల్లెలి పెళ్లిట."

"ఒస్ అయితే"అన్నాడు తేలిగ్గాతోసిపారేస్తూ.

"అదేమిటండీ అయితే అంటారు? రమ్మని రాసింది మాఅమ్మ?"

"నిన్నేనా నన్నుకూడానా?"

"ఇంటికి పెద్దల్లుడు మిమ్మల్ని పిలవకుండానా?"

"ఇంతకీ ఏమంటావ్?"

"ఏం చోద్యమండీ! ఏమనేదేముందీ బయలుదేరి వెళ్ళాలి" అంది స్థిరపరుచుకున్నట్టు.

"ఇప్పుడు సెలవుదొరకదు. పైగా ఇప్పుడు-"

"ఎప్పుడూఅంతే. నాపనైతే—"

"చెప్పనియ్యవేం, పైగాఇప్పుడు అంతదూరం ఎవడెడతాడు? డబ్బుమాత్రం మీ అమ్మేమైనా పంపుతుందా?"

"నాపనైతే మీకు కష్టపుచుతుంది. టైం దొరకదు. అదే స్నేహితుడి పెళ్ళికి నన్నుగూడ తీసికెళ్లి ఒక్కపూట భాగ్యానికి చదివింపులతో సహా వందరూపాయలు తగలేస్తారు— అది పనికొస్తుందేం? అదీకాక వాళ్ళఖర్చుతో నన్ను మొన్న వేసంగిలోనేగా తీసుకెళ్లి తీసుకువచ్చారు. మీదే డబ్బు. వాళ్ళ డబ్బు కోళ్ళేరుకుతింటున్నాయనుకున్నారా?"

"నేనూ అదే అంటూంట. మొన్న నే వెళ్లావు కదా అప్పుడే ఏమిటీ అని. ఇంక పెళ్లిమాడ్డం భాగ్యానికంత దూరమెందుకు. పోనీ ఈముడెట్టేదేమిటో అప్పుడేనా చేశారుకాదు" అన్నాడు నవ్వుతూ.

లలితకూడ నవ్వుతూ "నేనున్నానుగదా అని పెళ్ళిచేసేస్తారు గాబోలు. ఇదేమైనా బొమ్మల పెళ్ళనుకున్నారేమిటి తల్చుకున్నప్పుడు చేసెయ్యడానికి."

"ఇంకా-"

"పెళ్లికి నలుగురూ వస్తారు. అందర్ని ఒక్కమాటుచూడ్డం పడుతుంది. మా పిన్నిని చూసి చాలారోజులైంది. పిన్ని, మామయ్య, అంతా వస్తారని రాసింది మా అమ్మ" అంది బతిమాలుతున్న మొహంపెట్టి.

"మరేం ఫరవాలేదు. ఇప్పుడు కాకపోతే మరొప్పుడు చూద్దుగాని."

"అంతేనన్న మాట?"

"అంతే. ఏమైనా నేనుతీసికెళ్లేదిలేదు. నాకు సెలవు దొరకదు. కావలిస్తే మీ తమ్ముణ్ణి వచ్చి తీసికెళ్ళమను."

"వాడింకా కుర్రాడు. వాణ్ణొక్కణ్ణీ ఎక్కడికీ పంపదు మా అమ్మ."

"అహా! ఎంతప్రేమ! ఇప్పుడేపుట్టాడుకదూ! నేను వాడి యీడులోనేగా ఈ వూరొచ్చింది."

"మీరెలాగయినా గొప్పవారు. మీలాంటివారొక్కరుంటే మావాళ్లిల్లు పవిత్రమైపోను. కాని ఏంలాభం? ప్చ్!"

"సరే బాగానే మాట్లాడావుకాని, గుర్రాన్ని కట్టెయ్ మరి."

"మీరెంత వేళాకోళంగా మాట్లాడినా తప్పులేదు కాని నేనొక్క ముక్కంటే మీకెందుకంత కోపం? పోనీ మీరితరులతో మాట్లాడేటప్పుడు ముందిలా ఎప్పుడైనా ఆలోచించారూ?"

"నీతులు చక్కగా ఉన్నాయిగాని- నాకు పనుంది, పోతున్నాను."

"అయితే ఆ మాటేంజేసారు?"

"ఏమాట?"

"పెళ్లికెళ్లడం మాట."

"అదా! ఏం లాభంలేదు."

"పోనీలెండి. వెళ్ళనే వెళ్లను."

"అక్కడికి వెడితే తీసుకెళ్ళేవాళ్లు సిద్ధంగా ఉన్నట్టు."

"లేకపోతే ఒకప్పుడనుకున్నానా ఏం నా కోరిక చెల్లిస్తారని-"

"అనుకోవద్దు ఎప్పుడూ" అని నవ్వేశాడు.

లలిత మొహం చూసితీరవలసిందే. తీసికెళ్లకపోవడంకన్న వేళాకోళంఆమెను మరీ బాధించింది.

అది కనిబెట్టిన శేఖరం-"సరేగాని మనింట్లో రుమాళ్లున్నాయా?" అన్నాడు.

"ఏమో నాకేం తెలీదు" అంది విసురుగా.

"అహాఁ! కోప్పడకూ, ఉన్నాయా?"

"ఏం?"

"అలా అడుగు. నేనలా వెళ్లొస్తానుగాని, ఈలోపున తీరిగ్గా కాసేపు కళ్ళమ్మట నీళ్లెట్టుకుంటావేమో, కళ్ళు తుడుచుకుందుకు, ముక్కు తుడుచుకుందుకు చీర ఉపయోగిస్తే అది పాడైతే కొత్తవి కొనలేక నేను బాధపడాలి."

అంత కోపంలోను లలితకి నవ్వొచ్చింది. కాని అర్థం తలుచుకున్నకొద్దీ ఉడుకు ఎక్కువై కోపంగా పరిణమించింది. కోపంగా అంది.

"అంత ఏడవ్వాలసివస్తే నేనేదో చూసుకుంటాను గాని మీరేం అంత బాధపడకండి. ఇతరులెంత బాధపడుతున్నా చీమ కుట్టినట్టయినా ఉండదు మీకు. పైగా వేళాకోళం."

శేఖరం తాపీగా "అలాగే కానీ, నే వెడతాను" అన్నాడు.

కోటు భుజాన వేసుకుని మెల్లిగా అడుగులో అడుగేసుకుంటూ గేటు దాటుతూన్న శేఖరాన్ని కనబడేవరకు చూసి తలుపు జేరవేసి లోపల కెళ్ళింది.

శనివారంమాట జ్ఞాపకం రాగానే వాడబోసిన మినపప్పు రోటిదగ్గర కెళ్ళి రుబ్బింది. శనివారం రాత్రి శేఖరం భోజనంచెయ్యడు. "ఫలహారం" చేస్తాడు. ఇడ్లీ మున్షీ గారి ఆహార విధానాన్నవలంభించి భోజనం మానేస్తాడు వారానికో పూట. భోజనం మానెయ్యడం అంటే అన్నం మానెయ్యడం అన్నమాట. దానికి బదులు మరే ఖాద్య వస్తువు తిన్నా తప్పులేదని అతని భావం.

ఇంతలోకే పనిమనిషి వస్తే దానికి గిన్నెలు గ్రుటావేసి తలంటిపొయ్యడానికి ఉండమంది. దాసీది కళ్ళల్లో బాగా పులుసు పోసేసింది. కళ్ళు యెర్రబడిపోయాయి. దానికితోడు వానకాలమేమో కట్టెలు తడిసి అంటించగానే పొగ కమ్ముకుంది.

శేఖరం ఇంటికొచ్చి రెండుగదులు దాటేటప్పటికి ఊపిరాడనంతగా పొగ ఉండడం చూసి చిరాకెత్తిపోయాడు. లలిత, స్నానం హడావిడిలో పనిమనిషితో వంటసామాను సర్దమనడం మర్చిపోయింది. అది చూడగానే శేఖరానికి ఒంటికి కారం రాసినట్లయింది. దీనికి తోడు ఇంకో ఆలోచన, చెల్లెలి పెళ్ళికి తీసికెళ్ళనన్నానని లలితకి కోపం వచ్చిందని తట్టడం. దానితో కోపం తారాపథాన్నందుకుంది. ఇల్లు చిరాగ్గా ఉండడం యిష్టం ఉండ దతనికి. వెళ్ళేటప్పుడు అంత సరిగ్గా సద్దించి వెడతాడు. వస్తూనే ఇంట్లో ఏవేనా చిందరవందరగా ఉంటే తీసి యథాస్థానంలో ప్రతిష్టిస్తాడు. ఈ విషయంలో లోపం జరిగితేమాత్రం ఎవర్నీ క్షమించలేడు. ఈ సంగతి లలితకు బాగా తెలుసు సాధ్యమయినంతవరకు జాగ్రత్తగానే ఉంటుంది. మామూలు రోజుల్లో అయితే తనే తీసి ఎలా శ్రద్ధగా ఉంచాలో బోధిస్తాడు. కాని యీ రోజు తీరువేరు. వంటింట్లో లలిత మాడుముఖంతోను, ఎర్రని కళ్ళతోనూ పొయ్యిదగ్గిర ఫలహారం తయారుచేస్తూ కనబడగానే అతనికోపం పట్టపగ్గాలేకుండా పోయింది.

"నాకోసం ఫలహారం ఏమీచెయ్యొద్దు. నువ్వంత ఏడుస్తూ అవేం చెయ్యక్కర్లేదు" అన్నాడు చిరాగ్గా.

"నేనేం ఏడవడంలేదు" అంది లలిత ఏడుపు మొహంతోనే.

"మొహం చెప్పటంలేదూ? అద్దంలో చూసుకో తెలుస్తుంది. చెల్లెలి పెళ్ళికి తీసికెళనన్నానని ఆ కోపం ఇంటిమీదా చూపడం? ఎన్నిసార్లు చెప్పాను ఇల్లు దుకాణంలా ఉంచొద్దని నాకలా ఉంటె కిట్టదని. నా మాటమీదేమైనా గౌరవం ఉండేడిస్తేనా?" అన్నాడు కటువుగా.

అసలే కళ్ళమంటతో బాధపడుతున్న లలిత ఈ నూటీ పోటీ మాటలతో భగ్గుమంది. అయినా తమాయించుకుని "వాటికి కారణాలు మీరనుకున్నవి కావు" అనిమాత్రం అంది.

అతనేం చెప్పినా నమ్మే పరిస్థితుల్లో లేడు. "నువ్వు చేసినవి ఏమైనా నేను తినను" అన్నాడు మంకుపట్టుపట్టిన కుర్రాడిలా.

దీనితో ఆమె సహనశక్తి అంతరించింది. "తినకపోతే మానెయ్యండి" అంది.

ఈ ముక్క మరోరోజునంటే శేఖరం "నే తినకపోయినా నువ్వున్నావుగా చెల్లించడానికి" అని నవ్వేసివుండేవాడు. కాని ఈ రోజున వేడిమీదున్నాడేమో రుబ్బిన పిండంతా తీసుకెళ్ళి సైడుకాలవలో పారబోశాడు. లలిత దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసింది. చెయ్యని తప్పుకి శిక్ష. వెళ్ళి అతని చెయ్యిపట్టుకుని.

"మీమీద ఒట్టేసి చెపుతున్నాను. నేను పెళ్ళికి తీసికెళ్ళనన్నారని ఏడవటంలేదు. ఇందాక కుప్పమ్మ తలంటుపోస్తూ కంట్లో పులుసుపోసింది. దానికితోడు మండనిపుల్లలు తోడయాయి. దానదీన కళ్ళమ్మట నీళ్లువచ్చాయి" అనేసి వెంటనే బెడ్ రూములోకిపోయి తలగడలో తల దూర్చింది.

శేఖరం నిలువునా నీరైపోయాడు. కోపం అంతా జాలిగా మారిపోయింది. తనని తాను తిట్టుకున్నాడు. లలితని అపార్థం చేసుకున్నందుకు వెంటనే స్టోర్ రూములోకి వెళ్ళి డబ్బాలో మినప్పప్పు తీసి కళ్లి నీళ్ళల్లోపోసి అంత కటికపప్పు రుబ్బడ మొదలెట్టాడు. లలితకి యింతలోకే కొంత ఏకుపుతగ్గి కటుకుకటుకు రుబ్బుతూన్న చప్పుడై వచ్చిచూస్తే శేఖరం రుబ్బుతూ కనబడ్డాడు. కోపంఅంతాపోయి నవ్వువచ్చి శేఖరం చేతిలో పొత్రం లాక్కుని.

"నేరుబ్బుతా లెండి. నేనుండగా మీరు రుబ్బడమేమిటి? ఎవరైనా చూస్తే నవ్వుతారు"

"మరేం ఫరవాలేదు. ఆ నవ్వే వాళ్ళపళ్ళే బయటపడతాయి" అని బుజ్జగిస్తున్న ధోరణిలో మొదలుపెట్టాడు తనే రుబ్బుతూ.

"చూడు యిందాక ఏదో సరదాకి ఏడిపిద్దామని అల్లామాట్లాడాను కానినీమీదనాకుకోపమా? ఇప్పుడు పరిస్థితులు చెపుతాను ఏం?" అన్నాడు.

"చెప్పండి" అంది లలిత బుద్ధిమంతురాలిలాగ.

"ఇప్పుడు మాకు పిక్చర్ రిలీజు రోజులు. మూడు థియేటర్లలో ఒక్కమారే ఈ వూళ్ళోను, ఇంకా మిగతాచోట్ల రిలీజు చేస్తున్నాము. నే నుండకపోతే ఆఫీసుపని నడవదు. అవునా?"

"ఆఁ"

"ఇంక నిన్ను తీసికెళ్ళేవాళ్ళెవరు? మీతమ్ముడేమో చిన్నవాడాయె. మీ మామయ్యకి పెళ్ళి హడావిడి. ఇంకెల్లాగ?"

"చెప్పండి"

"నిన్నొక్కదాన్ని పంపడం నా కిష్టంలేదు. అదీకాక యింక నాలుగునెలల్లో వెళ్ళడం ఎల్లాగు తప్పదు. దేముడు మేలుచేసి అంతా సవ్యంగా జరిగితే అక్కడో నాలుగునెల్లుండక తప్పదు."

ఆ మాట వినగానే లలిత బుగ్గలు సిగ్గుతో కందాయి. తల కొద్దిగాఎత్తి ఆదోలా శేఖరంకేసి చూసి దించేసుకుంది. శేఖరంకూడ అదేరకమైన చూపుచూసి లలితని దగ్గరకు తీసుకున్నాడు ఆ చేతుల్తోటే.

కాస్సేపట్లాగే మంత్రబద్ధుల్లా ఉండిపోయారిద్దరూ.

"ఇంకా పుర్రచేష్టలు పోలేదు" అని మందలించింది దూరంగా జరుగుతూ.

"పైగా ఎదర బోలెడంత ఖర్చుంది. ఇప్పుడు రెండొందలుఖర్చుచేసి వెళ్ళావనుకో మళ్ళీ నాకు భోజనం యిబ్బందవుతుందని మళ్ళీ నెల్లాళ్ళల్లోనే వచ్చేస్తావాయెను. పురుడు, పుణ్యం అన్నీ అయ్యేదాకా అక్కడుండడం ఎల్లాగా పడదు. ఏమంటావు?"

"కానీండి."

"తరవాత ఇంత ఖర్చు పెట్టుకుని వెడితే పాతికో పరకోకంటె ఎక్కువ పెట్టడానికి పడదు మీ చెల్లెలికి. ప్రయాణం మానుకుంటే ఓ యాభైరూపాయలుపెట్టి ఏదైనా కొనిపంపవచ్చు. ఆ అమ్మాయి సంతోషపడుతుంది."

"బాగానే ఉంది. అల్లాగే కానీండి" అంది అంతా అర్థంచేసుకున్న లలిత, శేఖరంవైపు కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ.

"పద" అని రుబ్బినపప్పు గిన్నెలోకితోడి గూడ తీసికెళ్ళాడు.

"ఇది తీసికెళ్ళి అవి కానీనివెయ్యి. నేను ఆఫీసుకి ఫోన్‌చేసి కారు తెప్పిస్తాను. సెకండ్ షో పిక్చర్‌కి వెడదాం. ఇంకా లేటుకాలేదు గనక దారిలో జ్యూయెలరీషాపుకికూడ వెళ్ళి కొందాం. నువ్వే సెలక్టుచేద్దుదాని మీ చెల్లెలికి."

"ఏం అక్కర్లేదు లెండి. అయిన తతంగం అంతటితోటే కడుపునిండి పోయింది" అంది దెప్పిపొడుస్తూ.

"అబ్బే. అలా అంటే ఎలా. ఇందాకటిదంతా ఆటలో అరటిపండు. అయినా ఆ మాత్రం పేచీ లేకపోతే యిప్పుడింత సంతోషమే లేకపోను. ఇంక ఆలస్యం చెయ్యకు. ఆ సిల్కుచీరా, శాటిన్ జాకెట్ వేసుకుని తయారుకా."

"సరే" అంది లలిత కిలకిలా నవ్వుతూ.